

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**ఏయ్ మాలిక్ తెరే బందేహమ్**
**ఐసే హో హమారీ కరమ్**
**నేకీ ఫర్ చలే, ఔర్ బదీసే టలే**
**తాకి, హస్తే హుయే నిక్ లె దమ్**

సినీపాటలలో ఎన్నో భజన గీతాలున్నాయి. ఎన్నో అత్యద్భుతమైన భజనగీతాలు ఉన్నాయి. అవి వింటూంటే గానామృత రసప్రవాహంలో మైమరచిపోతాము. పాటలు మనస్సులో కలిగించిన ఆధ్యాత్మిక భావనల తరంగాల శృంగాలపై మనసు ఆనంద తాండవం చేస్తుంది. కళాసృజన వ్యక్తిలో నిద్రాణ స్థితిలో ఉన్న ఆధ్యాత్మిక భావనలకు ఊపునిచ్చి బ్రహ్మానంద భావన అంచులకు తీసుకు వెళ్తుందన్న ఆలోచనలోని నిజం గ్రహింపుకు వచ్చేలా ఈ పాటలు శ్రోతకు బ్రహ్మాండలోకంలో బ్రహ్మానంద భావనానుభూతిని కలిగిస్తాయి. పరవశులను చేస్తాయి. ఒక్కసారిగా వ్యక్తి శారీరక స్పృహను తొలగించి ఆత్మానుభూతిని కలిగిస్తాయి. స్వస్వరూప గ్రహణ శక్తినిస్తాయి. అలాంటి పాటలన్నిటిలోకీ అత్యద్భుతమైనది, తలమానికమనదగినది, ఈ ఒక్క పాట మిగిలితే చాలు మిగతా పాటలన్నీ వినపడకపోయిన ఫరవాలేదన్న భావనను కలిగించే పాట, 'దో ఆంఖే బారా హాథ్' సినిమాలోని 'ఏయ్ మాలిక్ తెరే బందే హం' భజనగీతం.

కళాకారుల కళాసృజనను అనుభవిస్తూంటే ఎంతో ఆశ్చర్యం అనిపిస్తుంది. ముఖ్యంగా, పాట రాయటం ఒక ఎత్తయితే, పాటకు బాణీ కట్టటం మరో ఎత్తు. ఆ తరువాత పాట ఆరంభ సంగీతం, చరణాల నడుమ సంగీతాన్ని సృజించటం అత్యంత అద్భుతం. ముఖ్యంగా, ఏ వాయిద్యం వాడాలి? ఏ వాయిద్యం ఎంతసేపు ఎలా మోగాలి? అన్న విషయాలను ఎలా నిర్ణయించారు? ఎన్నెన్ని చర్చలు జరిగి ఉంటాయి? అన్న విషయం ఆలోచిస్తే కళాకారులు మామూలు మనుషులు కారు అనిపిస్తుంది. ఏదో ఒక దివ్యశక్తి వారిద్వారా ప్రకటితమౌతూ, వారికి ప్రేరణనిస్తున్నదేమో అన్న భావన కలుగుతుంది. కవిత రచన, చిత్రలేఖనం వంటివి వ్యక్తిగత సృజనలు. కానీ సినీపాట అలాంటిది కాదు. విభిన్నమైన కళాకారులు సినీ సందర్భ పరిధిలో ఒదుగుతూ తను సృజనాత్మక విహంగాన్ని విశృంఖలంగా విహరింపచేయాల్సి ఉంటుంది.

శాంతారాం సినిమా 'దో ఆంఖే బారా హాథ్' భారతీయ చలన చిత్రాలలోనే విశిష్టమైన స్థానాన్ని ఆక్రమిస్తుంది. నాయిక పాత్ర, ప్రేమల గోలలు లేకుండా కేవలం మనిషిలోని మానవత్వాన్ని ఉద్దీపితం చేయటమనే లక్ష్యంతో నిర్మించిన సినిమా అది. మనిషిలోని మానవతపై నమ్మకం ప్రదర్శించే సినిమా. పైకి ఎంత పశువులా కనిపించినా, అతడిలో 'మనిషి' నిద్రాణ స్థితిలో ఉంటాడని, అతడిని మనిషిలా గౌరవిస్తే మానవుడవుతాడని నిరూపించిన సినిమా. అలాంటి సినిమాలో కథనం ఎంత ప్రాధాన్యమో, సున్నితమైన భావనలు జాగృతం చేయటం కూడా అంతే ప్రధానం. అయితే, 'దో ఆంఖే బారా హాథ్ ' సినిమా స్క్రిప్టులో పాటలకు ప్రాధాన్యం లేదు. సినిమా సంఘటనల ప్రధానంగా రూపొందింది. కానీ పాటలు లేని సినిమాను ఊహించటం కష్టం. అందుకని అసంబద్ధంగా అనిపించినా 'చంప' అనే పిల్లల బొమ్మలు అమ్మే పాత్రను కథలో ప్రవేశ పెట్టారు. ఆ పాత్ర ఆధారంగా స్క్రిప్టులో పాటలను ప్రవేశపెట్టారు. 'సయ్యా ఝూటోంక బడా సర్తాజ్ నిక్‌లా', 'ధుంతకథుం' వంటి పాటలు కేవలం 'చంప' పాత్ర వల్ల స్క్రిప్టులో చోటు చేసుకున్నాయి. 'ఉమడ్ ఘుమడ్ కర్ ఆయాహై ఘటా' పాట స్క్రిప్టులో

భాగం. నేరస్తులు మంచివారిగా మారే క్రమంలో కూరగాయలు పండిస్తారు. ఆ సమయంలో వర్షం పడుతున్నప్పుడు ఆనందాన్ని వ్యక్తపరచే పాట అది. ఆ పాటలో కూడా 'చంప' పాత్ర వీరితో కలసి పాడటం అనౌచిత్యం అయినా పాట ఊపులో అన్నీ మరచిపోతాం.

అయితే కరడు గట్టిన నేరస్తులను కరుణకల మనుషులుగా మార్చాలన్న జైలర్ 'ఆదినాథ్' ప్రయత్నం ఒకరకంగా ఆధ్యాత్మకమయినది. మనిషిలోని పశువుని అణచి మానవత్వాన్ని జాగృతం చేయటం సామాన్యమైన విషయం కాదు. అదీ ఎలాంటి మనుషులు? కరడు కట్టిన నేరస్తులు హంతకులు. జాలి, దయా, కరుణ వంటివి లేకుండా హత్య చేసినవారు. అలాంటి వారిని మనుషులుగా చేయటం ఏటికి ఎదురీదటం లాంటిది. ఆ ప్రయత్నంలో భాగంగా ఆదినాథ్ వారికి దైవ ప్రార్ధన అలవాటు చేస్తాడు. ఆ సందర్భంలో వస్తుంది ఈ ప్రార్ధనా గీతం 'ఏయ్ మాలిక్ తెరే బందె హం'

సినిమా స్క్రిప్టులో ఓ భజన లేక ప్రార్ధనా గీతానికి అవకాశం వచ్చింది. ఇక్కడే స్క్రిప్టు రచయిత చమత్కారం చేశాడు. తొలిసారి భజనను శాంతారాం పాత్ర చదువుతుంది లయ బద్దంగా. అప్పుడు నేరస్తులు పట్టించుకోరు. నిర్లక్ష్యంగా ఉంటారు. కానీ చివరలో, శాంతారాం పాత్ర మరణించినప్పుడు ఈ ప్రార్ధన పాడమని వారు చంప పాత్రను కోరతారు. అంటే ఒకే ప్రార్ధనా గీతం రెండుమార్లు వస్తుంది. కానీ, పాడేది ఒకేసారి. అంటే, స్క్రిప్టు రచయిత ఈ పాటను ఒక 'యూనివర్సల్ ప్రార్ధనా గీతం'లా ఊహించి ఉంటాడు. సకల మానవాళి హృదయలోతులలో ప్రతిధ్వనించే ప్రార్ధనా గీతాన్ని ఈ సందర్భంలో సృజించాల్సి ఉంటుంది. ఈ బాధ్యతను గేయ రచయిత భరత్ వ్యాస్ అత్యద్భుతంగా నిర్వహించాడు.

'భరత్ వ్యాస్' మామూలు సినీగేయ రచయిత కాదు. ఆయన మహా పండితుడు. సంస్కృత, హిందీ భాషలలో నిష్ణాతుడు. అదీ మామూలు హిందీ కాదు. శుద్ధ హిందీ. ఆ కాలంలో సినిమాలు పేరుకి హింది సినిమాలు కానీ 'ఉర్దూ ' వాడకం అధికంగా ఉండేది. భరత్ వ్యాస్ ఇందుకు వ్యతిరేకి. ఆయన తన జీవిత కాలంలో పాటలన్నీ ఎలాంటి రాజీ పడకుండా శుద్ధ హిందీలోనే రాశాడు. ఒకోసారి ఆయన పాటలు వింటూంటే కండ శర్కర నోట్లో కరుగుతున్న తీపి భావన కలుగుతుంది. ఆయన పదాల వాడకం అత్యద్భుతం. హింది అంటే తెలియని వారికి కూడా సులభంగా ఆ భావం బోధపడుతుంది. భారతీయ తత్వ చింతనను అవగాహన చేసుకున్న భరత్ వ్యాస్‌కు ఈ సందర్భంలో పాట రాసే బాధ్యతను అప్పగించారు.

పల్లవిలోనే గుండెలోంచి నిట్టూర్పు వెలువడే అత్యద్భుతమైన భావాన్ని ప్రదర్శించాడు.

'ఏయ్ మాలిక్ తెరే బందె హమ్''ఓ దేవుడా, నీ సృజన మేము' అన్నది భావం. 'బందె' అన్న పదానికి సేవకుడు, బానిస వంటి నెగిటివ్ అర్ధాలున్నాయి. ఆ పదానికి ఉన్న నానార్ధాలలో 'మనిషి' కూడా ఒకటి. సాధారణంగా ఈ వాక్యాన్ని 'నీ సేవకులం మేము'గా అనువదిస్తారు. అది పొరపాటు .ఎందుకంటే, ఇక్కడ గేయరచయిత భగవంతుడిని సంబోదిస్తూ 'తెరే బందె' అంటున్నాడు. 'భగవంతుడా నీ సేవకుడిని' అన్నా 'భగవంతుడా నీ బానిసను' అన్నా అన్వయం కుదరదు. భగవంతుడు మనిషిని తన ప్రతిబింబంలా సృజించాడంటారు. సకల ప్రాణులకు జీవం ఆయనే. కాబట్టి 'భగవంతుడా, నేను నీ సృజనను' అని అవగాహన చేసుకుంటే తరువాత వాక్యాలతో అన్వయం కుదురుతుంది. 'నీ కొండకు నీవే రప్పించుకో'లాగా, ఇక్కడ కూడా 'మేము నీ సృష్టి' అని తన సంపూర్ణ బాధ్యతను భగవంతుడిపై పెడుతున్నాడు మనిషి. మేము నీ సృష్టి కాబట్టి మా చర్యలు ఎలా ఉండాలంటే అన్నీ సత్యమైన దారిలో ఉండాలి, చెడు వైపు వెళ్లకూడదు అని ప్రార్థిస్తూ 'తాకి హస్తే హువే నిక్‌లె దం' అంటాడు. 'నవ్వుతూ ప్రాణం పోవాలి' నిజం చెప్పాలంటే ఎప్పుడూ ఈ పాటలో ఈ పంక్తులు విన్నా కళ్లల్లో నీళ్లు వస్తాయి. గుండె ఝల్లుమంటుంది. ఒక పరమాద్భుతమైన సత్యం, అపురూపమైన సత్యం క్షణం సేపు మెరుపులా మెరసి అదృశ్యమైతే, అంత క్షణం కాలంలో ఆ అనంత సత్య స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలన్న తపన, అవగాహన చేసుకోలేని అశక్తత, కనీసం ఈ అద్భుతాన్ని

క్షణకాలమైనా అనుభవించామన్న ఆనందం, సర్వం మిళితమై కలిగించే విభిన్నమైన భావాల సమాహారం కళ్ళల్లో కదిలే నీరు గుండెల్లో మెదిలే ప్రార్థన.

మనిషి జన్మిస్తాడు. ఎదుగుతాడు. బోలెడన్ని ఆశలు, కోరికలతో జీవితం కొనసాగిస్తాడు. పలురకాల పనులు చేస్తాడు. సంతోషిస్తాడు. దుఃఖిస్తాడు. ఏం చేసినా జన్మించినప్పటి నుంచీ మనిషి ప్రయాణం మరణం వైపుకే! అది గమ్యం! అయితే 'మరణం' మనిషి జీవితాన్ని ప్రతిబింబిస్తుందంటుంది తత్వం. తన జీవన ప్రయాణంలో మనిషి అవలంబించిన పద్ధతులు, ప్రయాణించిన దారులు, చేసిన పనులు అతని గమ్యాన్ని నిర్దేశిస్తాయి. అంటే ఒక వ్యక్తి మరణాన్ని పొందిన విధానం అతడి జీవితకాలం పనుల ప్రతిఫలం అన్నమాట.

గమనిస్తే, 'మరణం' ఒకటే అయినా ఏ వ్యక్తి మరణం మరో వ్యక్తి మరణాన్ని పోలి ఉండదు. అతడి జీవితాన్ని గమనించినవారు అతడి మరణాన్ని ఊహించలేరు. అతడు మరణించిన విధానం ఆశ్చర్యం కలిగిస్తుంది. కొందరు అనారోగ్యంతో బాధ పడి పడి పోతారు. కొందరు తీరని బాధ్యతలను గుర్తుచేసుకుంటూ బాధపడుతూ పోతారు. ఇంకొందరు తాము బాధపడుతూ, ఇతరులను బాధిస్తూ పోతారు. కొందరు ఎంతో దర్జాగా, ఐశ్వర్యంతో బ్రతికి చివరికి 'నా' అన్నవారు లేక, నికృష్టమైన దారిద్ర్యంలో మరణిస్తారు. కొందరు అనాయాస మరణం పొందుతారు. అందుకే ప్రతివ్యక్తి ఎన్నెన్ని కోరినా, దేవుడిని ఎంతగా ప్రార్థించినా అసలు ప్రార్థించవలసినది 'సత్కార్యాలు చేస్తూ, మంచి బాటలో నడుస్తూ, చెడుకు దూరంగా ఉండాలి. ఎందుకంటే, నవ్వుతూ మరణించాలి' నవ్వుతూ మరణించటమంటే సంతృప్తితో, ఆనందంగా ఈ శరీరాన్ని వదిలిపోవటం!

శ్రీదేవి జీవితాన్ని గమనిస్తూ వచ్చిన వారెవరూ ఆమె హఠాన్మరణం, బాత్ టబ్‌లో సంభవిస్తుందని ఊహించి ఉండరు. రాజీవ్ గాంధీ అలా, ఓ బహిరంగ సభలో బాంబుదాడికి గురై అత్యంత దారుణంగా హత్యకు గురవుతాడని కలలో కూడా అనుకుని ఉండరు. జార్జ్ ఫెర్నాండేజ్, అటల్ బిహారీ వాజ్‌పేయి మరణించేముందు జీవచ్ఛవంలా కొన్నేళ్ళు బ్రతికి మరణించారన్న ఆలోచనే బాధ కలిగిస్తుంది. ఇలా ఒక వ్యక్తి జీవితాన్ని మరణాన్ని గమనిస్తే , 'హస్తే హువే నిక్ లె దం' అనటం వెనుక ఉన్న భావం బోధపడుతుంది. 'గాడ్ ఫాదర్' నవలలో 'గాడ్ ఫాదర్' పిల్లవాడితో ఆడుతూ ఆడుతూ పడి మరణించటం ఎంతో గొప్పగా అనిపిస్తుంది. బాధ్యతలన్నీ తీరిపోయాయి. ఇక సాధించేదేం లేదు. అలాంటి పరిస్థితిలో మరణం ఆహ్వానించదగ్గ విషయం. అదీ అనాయస మరణం. ఆవేశాలు, ఉద్విగ్నతలు, నిరాశలు, దుఃఖాలు, ఏడుపులు ఏమీ లేకుండా చిరునవ్వుతో, ప్రశాంతంగా, సంతృప్తిగా, ఈ శరీరాన్ని వదిలివేయటం తప్ప మనిషి భగవంతుడిని కోరాల్సింది, కోరగలిగేదీ ఏమీలేదు.

**బడ కంజోర్ హై ఆద్మీ**
**అభిలాఖో హై ఇస్‌మే కమీ**
**పర్ తూ జో ఖడా, హైదయాళూ బడా**
**తేరి క్రిపాసే ధర్తీ థమీ**
**దియె తూనే హమే జబ్ జనమ్**
**తూహీ ఝేలేగ హం సబ్‌కె గమ్**

ఒక్క పదం, ఒక్కో వాక్యం ఎంతో భావాన్ని తనలో ఇముడ్చుకున్నది. ఎన్నెన్నో ఆలోచనలను రేకెత్తించేది. ఎంతెంతో వ్యాఖ్యానానికి అనువయినది. 'మనిషి స్వతహాగా బలహీనుడు' అతడిలో లోపాలు అనేకం ఉన్నాయి. ఈ ఒక్క వాక్యం చాలు కొన్ని వేల పేజీల వివరణకు. భారతీయ ధర్మం మనిషిని ఇంద్రియాలు మోసం చేస్తాయంటుంది. మనిషి ఇంద్రియాల ప్రలోభంలో పడతాడంటుంది. వాటి ప్రలోభంలో పడవద్దని హెచ్చరిస్తుంది. కనబడుతున్న ప్రపంచాన్ని దాటి చూడమంటుంది. ఇంద్రియ ప్రలోభానికి లొంగకుండా ముందుకు సాగమంటుంది.

పెద్ద పెద్ద తాపసులే ఏదో ఒక దశలో, ఏదో ఒక ప్రలోభానికి లొంగుతారు. దాంతో తపస్సు ఫలం పోతుంది. మళ్లీ తపస్సు చేయాల్సివస్తుంది. నీరు ఎలాగయితే పల్లానికి ప్రయాణిస్తుందో, అలా మనిషి మనసు చెడువైపు ఆకర్షితమవుతుంది. ఈ విషయంలో మనిషి బలహీనుడు. వందమార్లు చెడునుండి తప్పించుకున్న వంద ఒకటవమారు లొంగిపోతాడు. అది మనిషి బలహీనత. అందుకే 'మనిషి బలహీనుడు. అతడిలో చాలా లోపాలున్నాయి' అంటున్నాడు కవి. కానీ మనిషి ఎంత బలహీనుడో భగవంతుడు అంత దయాళువు. అతని కృపవల్లనే ఈ ప్రపంచం నడుస్తోంది. మనకు జన్మనిచ్చింది భగవంతుడే. సృష్టి భగవంతుడి కల్పననే. కాబట్టి మనల్ని పుట్టించినవాడే కష్టాల్ని తీరుస్తాడు. నారు పోసినవాడు నీరు పోయకుండా ఉండడు. కాబట్టి భారమంతా భగవంతుడిపై వేసి, దేనికీ నిరాశ చెందకుండా, భయపడకుండా ఆత్రం లేకుండా సత్యమార్గంలో ప్రయాణించాలి మనిషి. చిరునవ్వుతో సంతృప్తికరమైన మరణం తప్ప భగవంతుడిని మరేమీ కోరనవసరంలేదు.

**యే అంధేరా ఘనా ఛా రహా**
**తేర ఇన్సాన్ ఘబ్‌రాగయా**
**హోరహో భే ఖబర్, కుఛ్ న ఆతా నజర్**
**సుఖ్ క సూరజ్ ఛుపా జారహా**
**హై తేరీ రోషనీ మే జో దమ్**
**తూ అమావస్ కో కర్ దే పూనమ్**

అత్యంత మార్మికమైన చరణం ఇది. మనిషి బలహీనుడు. కానీ నారు పోసినవాడే నీరు పోసినట్టు జన్మనిచ్చిన వాడే కష్టాలనుండి గట్టెక్కిస్తాడు. కానీ పలు సందర్భాలలో మనిషిని అనుమానాలు చుట్టుముడతాయి. అజ్ఞానం ముంచెత్తుతుంది. మనిషికి నమ్మకం పోతుంది. విశ్వాసం నశిస్తుంది. అలాంటి సందర్భాలలో కూడా భగవంతుడు ఎంత శక్తిమంతుడంటే అమావాస్యను కూడా పౌర్ణమిలా మార్చగలడు ఇక్కడ చీకటి అజ్ఞానం. విజ్ఞానం వెలుతురు. చీకటి మనిషిలో లేనిపోని భయాలు కలిగిస్తాయి. అందుకే ఘోరమైన చీకటి దట్టంగా ఉన్నా ప్రార్థించాల్సింది ఒకటే. సత్య పథం నుంచి తప్పకూడదు. చెడునుంచి తప్పించుకోవాలి. చిరునవ్వుతో మరణాన్ని కోరాలి.

**జబ్ జుల్మోంక హో సామ్నా**
**తబ్ తూ హీ హమే థామ్నా**
**వొ బురాయీ కరే, హం భలాయీ భరే**
**నహి బద్‌లేక కొయీ కామ్నా**
**బఢ్ ఉఠే ప్యార్ కా హర్ కదమ్**
**ఔర్ మిటే బైర్ కాయే భరమ్**

మనిషి ఎంత అణచి వేతకు గురికానీ, ఎలాంటి దౌర్జన్యానికి గురికానీ, భగవంతుడే రక్షిస్తాడు. ఎదుటివాడు చెడు చేసినా మనం వాడికి మంచి చేయాలి. ప్రతీకార భావనను దరిదాపులకు కూడా రానీయకూడదు. ప్రతి అడుగు ప్రేమతో నిండి ఉండాలి. పరాయివాడు, శత్రువు అన్న భావన తొలిగిపోవాలి. సత్యపథంలో ప్రయాణిస్తూ, చెడు నుంచి తప్పించుకుంటూ చిరునవ్వుతో సంతృప్తికరంగా మరణించాలి.

ఇదీ ఈ సందర్భంలో భరత్ వ్యాస్ రాసిన గీతం. అత్యద్భుతమైన గీతం. ఎక్కడా ఈ గీతంలో 'మతం' ప్రస్తావన రాదు. ఈ పాటను ఏ మతం వారయినా పాడుకోవచ్చు. స్ఫూర్తిని, శాంతిని పొందవచ్చు. అసలు సిసలైన లౌకిక భావనతో సృజించిన గీతం ఇది. అందుకే ఈ పాటను స్కూళ్లల్లో ప్రార్ధనా గీతంగా పాడుతున్నారీనాటికీ. లాహోర్‌లో, పంజాబ్ స్కూళ్లలో ఈనాటికీ ఈ పాట ప్రార్ధనా గీతం. అంత గొప్ప పాట ఇది.

ఈ పాటకు బాణీని కూర్చింది వసంత్ దేశాయ్. వసంత దేశాయ్ ఈ పాట కోసం 'భైరవ్'రాగాన్ని ఎన్నుకున్నాడు. ఇక్కడే సగం విజయం సాధించాడు. భైరవ్ రాగం సంపూర్ణరాగం. ఉదయకాలంలో పాడే రాగం ఇది. భైరవ్ రాగం కర్ణాటక సంగీతంలో 'మాయామాళవ గౌళ' రాగానికి సమానమైనది. ఇక్కడే వసంత్ దేశాయ్ గొప్ప చమత్కారం చేశాడు. భైరవ్ రాగంలోని నిషాదాన్ని కోమల నిషాదం చేశాడు. దాంతో ఈ పాట శుద్ధ భైరవ్ రాగం కాకుండా కాస్త బసంత్ ముఖారి (కర్ణాటకలో వకుళాభరణం)లా ధ్వనిస్తుంది. సాధారణంగా సినీగీతాలలో ఏ సంగీత దర్శకుడు కూడా శుద్దరాగాలను వాడడు. అధికంగా మిశ్రిత రాగాలను వాడతాడు. దాంతో ఈ పాట భైరవ్, బసంత్ ముఖారిల సరిహద్దులపై నడయాడుతూ తనదైన ప్రత్యేక సౌందర్యాన్ని సంతరించుకుంది. ఆరంభం నుండి వాయిద్యాలలో ఒకరకమైన ఉద్విగ్నత కనిపిస్తుంది. చరణాల నడుమ వచ్చే సంగీతంలో వయొలిన్లు అతి వేగంగా ప్రవహిస్తూ ఒకదానిపై ఒకటి దొర్లుతూ కలసి ప్రవహించే ప్రచండ నీటి ధారల్లా అనిపిస్తాయి. పాట 'మూడ్'ను మరింత ఉద్విగ్నతమయం, భక్తిమయం చేస్తూ పాటకే పవిత్రతను ఆపాదిస్తాయి. 'కోరస్' పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తుంది. అందుకే పాట చిత్రీకరణలో కూడా ఈ సాంద్రత, పవిత్రతలు కనబడతాయి. ముఖ్యంగా 'లైటింగ్'ను అత్యంత సృజనాత్మకంగా వాడుకుని పాటను ఒక ఆధ్యాత్మిక అనుభవంలా మలచాడు దర్శకుడు. దాంతో 'దో ఆంఖే బారాహాథ్' సినిమా అనగానే ఈ పాట గుర్తుకు రావటమే కాదు, సినిమా పరిధిని దాటి నిత్యజీవితంలో స్మరిస్తూ సాంత్వనను, విశ్వాసాన్నిచే అత్యద్భుతమైన గీతంలా ఎదిగింది 'ఏయ్ మాలిక్' పాట.

ఈ పాటను లతా మంగేష్కర్ పాడిన విధానం గురించి ఎంత చెప్పినా తక్కువే. 'సరస్వతీదేవి ' అనుకుని సాష్టాంగ ప్రణామాలు ఆచరించటం తప్ప ఏమీ చేయలేము. ఒక్కో పదాన్ని ఆమె పలికిన తీరు, రాగం తీసిన తీరు, పదాలలో భావాన్ని పలికి జీవం పోసిన తీరు, సరస్వతీ దేవి స్వయాన తన శక్తి ప్రదర్శన కోసం ఈ పాటను పాడిందేమో అనిపిస్తుంది. ఈ పాట కాక భరత్ వ్యాస్, వసంత్ దేశాయ్ కలయికలోని 'నిర్బల్ సే లడాయి భగ్వాన్ కీ ' 'గుడ్డి' సినిమాలో 'హం కో మన్‌కి శక్తి దేనా' వంటి పాటలు కూడా భక్తి కార్యక్రమాలలోనూ, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలలోనూ ఈనాటికీ 'భజన' గీతాలుగా, స్ఫూర్తివంతమైన గీతాలుగా వాడుకుంటున్నారు. ఇది అత్యద్భుతమైన కళాకారులు తమ హృదయలోతుల్లోంచి కళాసృజన కొలిస్తే, దాన్ని అనుభవించేవారు బ్రహ్మానందాన్ని అనుభవిస్తారనటానికి అత్యున్నత నిదర్శన. బహుశా ఇలాంటి కళాకారులవల్లనే జీవితం అర్ధవంతం అనిపిస్తుందేమో.

(మళ్లీ వచ్చే నెల )

Post your comments